PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక



జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374



వరంగల్ | సంచిక 215 | సంపుటి 4 | బుధవారం | 22-04-2026 | పేజీలు 4 | వెల 3/- | ఎడిటర్ పి. రవిచంద్ర


## చర్చలు తుస్సు..

# సమ్మెకు 'సై'..

## అర్ధరాత్రి నుంచే ఆర్టీసీ బంద్!




- ప్రభుత్వంతో జేఏసీ నేతల చర్చలు విఫలం
- ఐఏఎస్ అధికారుల కమిటీ ప్రతిపాదనను తిరస్కరించిన జేఏసీ..
- నేటి అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగనున్న కార్మికులు
- 32 డిమాండ్ల కోసం ఆర్టీసీ నిరవధిక సమ్మె
- మా డిమాండ్లు కొత్తవి కావు, హామీలు అమలు చేయాల్సిందే : జేఏసీ చైర్మన్ వెంకన్న


— వివరాలు 2వ పేజీలో..


రాష్ట్రంలో రవాణా సమరం మొదలైంది. ప్రభుత్వానికి, ఆర్టీసీ కార్మిక సంఘాలకు మధ్య సాగిన 'చర్చల' పర్వం చేదు అనుభవంతో ముగిసింది. సమ్మెను నివారించేందుకు ఐఏఎస్ అధికారుల కమిటీ జరిపిన రాయబారం విఫలం కావడంతో, ఆర్టీసీ జేఏసీ (JAC) పోరుబాట పట్టింది. నేటి అర్ధరాత్రి నుంచే బస్సు చక్రాలను నిలిపివేస్తున్నట్లు సమ్మె సైరన్ మోగించింది. 32 డిమాండ్ల సాధన కోసం 'ఇప్పుడే.. ఇక్కడే' తేల్చుకోవాలని జేఏసీ పట్టుబట్టగా, 'నాలుగు వారాల గడువు' కావాలని ప్రభుత్వం కోరడంతో చర్చలు కాస్తా రసాభాసగా మారి ముగిశాయి. దీంతో రేపటి నుంచి సామాన్యుడి ప్రయాణం అగమ్యగోచరంగా మారనుంది. — ప్రభాత గమనం, హైదరాబాద్




## ఉప్పల్‌లో అభిషేక్ సునామీ


04


- భారీ సెంచరీతో షేక్ ఆడించిన అభిషేక్ వర్మ
- నాలుగు వికెట్లతో ఢిల్లీని మడతబెట్టిన మలింగ
- ఆరెంజ్ ఆర్మీ ఘన విజయం

సన్ రైజర్స్ హైదరాబాద్ హ్యాట్రిక్ కొట్టింది. సొంతగడ్డ ఉప్పల్ లో మరోసారి జయకేతనం ఎగురవేసింది. డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ భారీ సెంచరీ, పేసర్ ఏషన్ మలింగ నాలుగు వికెట్లతో రాణించిన వేళ ఆరెంజ్ ఆర్మీ 47 పరుగుల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టింది. సన్ రైజర్స్ నిర్దేశించిన 243 పరుగుల భారీ ఛేదనలో ఢిల్లీ ఓవర్లన్నీ ఆడి వికెట్లు కోల్పోయి 195 పరుగులే చేయగలిగింది. నితీశ్ రాణా (57), సమీర్ రిజ్వీ (41) పోరాటం సరిపోలేదు. సన్ రైజర్స్ బౌలర్లలో ఏషన్ మలింగ 4, హర్ష్ దూబే 3, మధుషంక, సాకిబ్ హుస్సేన్ చెరో వికెట్ పడగొట్టారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన సన్రైజర్స్ 20 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 242 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (135 పరుగులు, నాటౌట్) సెంచరీతో అదరగొట్టాడు.



## అక్రమ కేసులను ఎదుర్కొనేందుకే ఢిల్లీ వెళ్లా


2


- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై హరీశ్ రావు కౌంటర్
- సీఎం హుందాగా వ్యవహరించాలని హితవు
- తన ఢిల్లీ పర్యటనపై చిల్లర ప్రచారం చేశారని వ్యాఖ్య

## వరంగల్‌లో 'హ్యాష్ ఆయిల్' పట్టివేత

- రూ. 2.5 కోట్ల విలువైన 40 కిలోల గంజాయి నూనె స్వాధీనం
- ముంబైకి తరలిస్తుండగా పట్టుకున్న రైల్వే పోలీసులు
- నలుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీపీ సన ప్రీత్ సింగ్


04





వరంగల్ రైల్వే పోలీసుల నిఘాకు భారీ అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా చిక్కింది. ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ముంబైకి అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ. 2.5 కోట్ల విలువైన హ్యాష్ ఆయిల్ (గంజాయి నూనె)ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేయగా, మరో నిందితుడు కిలో పాండు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.

## రేవంత్ రాహువు.. కేసీఆర్ కేతువు

### ఇద్దరూ కలిసి ప్రజలను ముంచుతున్నారు..

- కాళేశ్వరం అవినీతిని కప్పిపుచ్చేందుకే సీఎం డ్రామాలు..
- కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు!
- బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని స్పష్టీకరణ


4




## 'భూభారతి'తో రైతులకు శాశ్వత భరోసా!

- కూసుమంచిలో సర్వే మ్యాప్ తో తొలి రిజిస్ట్రేషన్..
- ప్రతి ఇంచుకు ప్రత్యేక 'భూధార్' నంబర్..
- రెవెన్యూ సంస్కరణలపై మంత్రి పొంగులేటి కీలక ప్రకటన


4




# ఆర్టీసీలో సమ్మె సైరన్

- ప్రభుత్వంతో జేఏసీ నేతల చర్చలు విఫలం
- ఐఏఎస్ అధికారుల కమిటీ ప్రతిపాదనను తిరస్కరించిన జేఏసీ..
- నేటి అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగనున్న కార్మికులు
- 32 డిమాండ్ల కోసం ఆర్టీసీ నిరవధిక సమ్మె
- మా డిమాండ్లు కొత్తవి కావు, హామీలు అమలు చేయాల్సిందే : జేఏసీ చైర్మన్ వెంకన్న



ప్రభాత గమనం, హైదరాబాద్, ఏప్రిల్ 21 :

రాష్ట్రంలో రవాణా వ్యవస్థ స్తంభించిపోయే ప్రమాదం నెలకొంది. ప్రభుత్వంతో ఆర్టీసీ జేఏసీ (JAC) నాయకులు జరిపిన చర్చలు ఫలించకపోవడంతో, నేటి అర్ధరాత్రి నుంచే సమ్మెకు దిగుతున్నట్లు సంఘాల నేతలు అధికారికంగా ప్రకటించారు. దీంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పేలా లేవు. సమ్మెను నివారించేందుకు ప్రభుత్వం నియమించిన ఐఏఎస్ అధికారుల కమిటీ మంగళవారం జేఏసీ నేతలతో సుదీర్ఘంగా చర్చలు జరిపింది. ఈ సందర్భంగా తమ సమస్యల పరిష్కారానికి నాలుగు వారాల సమయం ఇవ్వాలని, అప్పటి వరకు సమ్మెను విరమించుకోవాలని కమిటీ విజ్ఞప్తి చేసింది. అయితే, ఈ ప్రతిపాదనను జేఏసీ నేతలు తోసిపుచ్చారు.

**గత హామీలనే అమలు చేయాలి: జేఏసీ చైర్మన్ వెంకన్న**

చర్చల అనంతరం జేఏసీ చైర్మన్ వెంకన్న మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "మా సమస్యలన్నీ అధికారులకు వివరించాము. మా డిమాండ్లు ఏవీ కొత్తవి కావు, గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలనే అమలు చేయాలని కోరుతున్నాం. అయితే, కమిటీ మాత్రం మమ్మల్ని సమయం కోరడంతో పాటు.. 'మా మాట వింటే వినండి లేదంటే లేదు' అన్నట్లుగా వ్యవహరించింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే తాము సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని వెంకన్న స్పష్టం చేశారు. తమకున్న 32 డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని ఆయన ప్రకటించారు. కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రభుత్వం దృష్టి సారించినప్పటికీ, ఆర్టీసీ బస్సులు నిలిచిపోతే సామాన్యులపై ఆ ప్రభావం తీవ్రంగా ఉండనుంది.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తాం..

- పార్టీ ఆవిర్భావ సభకు సర్వం సిద్ధం
- యువతకు మా పార్టీలో పెద్దపీట!
- ఆర్టీసీ సమ్మెకు సంపూర్ణ మద్దతు..
- వెయ్యేండ్లయినా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మారవు..
- జాగృతి చీఫ్ కల్వకుంట్ల కవిత



ప్రభాత గమనం, హైదరాబాద్, ఏప్రిల్ 21 :

రాష్ట్రంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తమ పార్టీ ముందుకు సాగుతుందని, పార్టీ ఆవిర్భావ సభ ఏర్పాట్లు అత్యంత వేగంగా జరుగుతున్నాయని జాగృతి చీఫ్ కల్వకుంట్ల కవిత వెల్లడించారు. మంగళవారం ఆమె మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. రాష్ట్ర రాజకీయాలు, ప్రజా సమస్యలు రాబోయే పార్టీ సభ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు.

**సభకు ఆటంకం లేకుండా చూడాలి:**

పార్టీ ఆవిర్భావ సభకు భారీ సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు తరలివచ్చే అవకాశం ఉన్నందున, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె డీజీపీని కోరారు. సభను దిగ్విజయంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయం అవసరమని పేర్కొన్నారు.

**ఆర్టీసీ సమ్మెకు జై..**

రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని కవిత స్పష్టం చేశారు. రాష్ట్రంలో నీటి సమస్యలు, ఫీజు రీఎంబర్స్ మెంట్ వంటి తీవ్రమైన సమస్యలు ఉన్నాయని.. కానీ బీఆర్ఎస్ 'ఉట్టి కథలు', కాంగ్రెస్ 'పిట్ట కథలు' చెబుతూ ప్రజలను వంచిస్తున్నాయని మండిపడ్డారు. ఈ రెండు పార్టీలు వెయ్యేళ్లయినా మారవని ఆమె ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీలో మహిళలకు ప్రాధాన్యం ఉండదని, కేంద్ర సమస్యలపై మాట్లాడే దమ్ము ఆ పార్టీకి లేదని విమర్శించారు. తమ పార్టీలో మాత్రం యువతకు అత్యధిక అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

**జీవన్ రెడ్డి పచ్చి తెలంగాణ వ్యతిరేకి**

ఇటీవల బీఆర్ఎస్ పార్టీలో చేరిన మాజీ కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి పచ్చి తెలంగాణ వ్యతిరేకి అని కవిత ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాలను ఫణంగా పెట్టిన వ్యక్తులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాను నిరంతరం పనిచేస్తానని ఆమె పునరుద్ఘాటించారు..

## అక్రమ కేసులను ఎదుర్కొనేందుకే ఢిల్లీ వెళ్లా

- కాటారం బహిరంగ సభలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై హరీశ్ రావు కౌంటర్
- సీఎం హుందాగా వ్యవహరించాలని హితవు
- తన ఢిల్లీ పర్యటనపై చిల్లర ప్రచారం చేశారని వ్యాఖ్య



ప్రభాత గమనం, హైదరాబాద్, ఏప్రిల్ 21 :

ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి హుందాగా వ్యవహరించాలని, కానీ రేవంత్ రెడ్డి వీధి రౌడీలా (స్ట్రీట్‌మెన్) మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ధీటుగా కౌంటర్ ఇచ్చారు.

**ఢిల్లీ పర్యటనపై కాంగ్రెస్ చిల్లర ప్రచారం..**

తన ఢిల్లీ పర్యటనపై కాంగ్రెస్ చేస్తున్న చిల్లర ప్రచారాన్ని హరీశ్‌రావు ఖండించారు. "పార్టీ అధ్యక్షుడి సూచన మేరకే నేను ఢిల్లీ వెళ్లాను. ముఖ్యమంత్రి ప్రభుత్వం తరపున పెడుతున్న అక్రమ కేసులను, ముఖ్యంగా కాళేశ్వరం అంశంపై న్యాయపరంగా పోరాడేందుకే సీనియర్ లాయర్లను కలిశాను. ఇందులో దాచాల్సింది ఏమీ లేదు" అని స్పష్టం చేశారు.

**కేసీఆర్ 'స్టేట్‌మెన్'.. రేవంత్ 'స్ట్రీట్‌మెన్':**

బీఆరఎస్, కాంగ్రెస్ సభల రేటింగ్‌లను ప్రస్తావిస్తూ.. "కేసీఆర్ ప్రసంగాన్ని యూట్యూబ్‌లో 36 లక్షల మంది చూస్తే, రేవంత్ రెడ్డిని కేవలం 4 లక్షల మంది మాత్రమే చూశారు. ఎవరి స్థాయి ఏంటో దీనిని బట్టే అర్థమవుతోందన్నారు . కేసీఆర్ గంట సేపు ప్రసంగించినా ఎక్కడా రేవంత్ పేరు ఎత్తకుండా ఒక స్టేట్‌మెన్‌లా మాట్లాడారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం ఎలాంటి గౌరవం లేకుండా స్ట్రీట్ మెన్ గా మాట్లాడి పరువు పోగొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి ఇంకా సమయం ఉందని కనీసం మిగిలిన కాలమైనా సరిగ్గా పాలిస్తే వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు దక్కుతాయని హితవు పలికారు.

**ఓటుకు నోటు కేసులో రేవంత్ ముద్దాయి:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత నాలుగున్నరేళ్లుగా స్టేల మీదనే కొనసాగుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. "రేపు సుప్రీంకోర్టులో ఓటుకు నోటు కేసు విచారణకు రానుంది. ఇందులో రేవంత్ రెడ్డి ప్రధాన ముద్దాయి. హోంశాఖ తరపున సాదాసీదా లాయర్‌ను పెట్టి, నిందితుల తరపున మాత్రం ముకుల్ రోహత్గీ వంటి ఖరీదైన లాయర్లను పెట్టుకున్నారు. ఈ కేసులో బీఆర్ఎస్ నేతలు ఇంప్లీడ్ అయ్యారు, న్యాయపోరాటం కొనసాగు

# బాణసంచా గిడ్డంగిలో భారీ పేలుడు!

- 13 మంది మృతి, 30 మందికి గాయాలు..
- ఐదుగురి పరిస్థితి విషమం..
- కేరళలోని త్రిసూర్ జిల్లాలో ఘోర ప్రమాదం..
- ప్రధాని మోదీ, సీఎం పినరయి విజయన్ దిగ్భ్రాంతి



ప్రభాత గమనం, త్రిసూర్:

కేరళ రాష్ట్రంలో అత్యంత వైభవంగా జరిగే 'త్రిసూర్ పూరం' ఉత్సవాలకు ముందే పెను విషాదం ముంచుకొచ్చింది. మంగళవారం జిల్లాలోని ఒక బాణసంచా గిడ్డంగిలో సంభవించిన భారీ పేలుడు 13 మందిని బలితీసుకోగా, మరో 30 మందికి పైగా గాయపడ్డారు. పేలుడు ధాటికి గిడ్డంగి పరిసర ప్రాంతాలు మరుభూమిని తలపించాయి.

**నిల్వ కేంద్రంలో నిప్పు రవ్వ**

మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న పూరం ఉత్సవాల కోసం స్థానికంగా పంట పొలాల్లోని తాత్కాలిక షెడ్లలో భారీగా బాణసంచాను తయారు చేసి నిల్వ ఉంచారు. మంగళవారం పని జరుగుతుండగా ఒక్కసారిగా నిప్పురవ్వలు ఎగిసిపడి పేలుడు సంభవించినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ పేలుడు ధాటికి షెడ్లు పూర్తిగా ధ్వంసమవడమే కాకుండా, సమీపంలో ఉన్న వారికి తీవ్ర గాయాలయ్యాయి.

**సహాయక చర్యలు ముమ్మరం:**

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, అధికారులు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన 30 మందిని త్రిసూర్ మెడికల్ కాలేజీ సహా సమీప ఆసుపత్రులకు తరలించారు. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని, వారికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (KSDMA) తెలిపింది. ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ ఆదేశాల మేరకు 'కనివు 108' అంబులెన్స్ లను భారీగా ఘటనా స్థలానికి తరలించారు.

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన నేతలు:**

ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ స్పందిస్తూ, ఉత్సవాల తరుణంలో ఈ విషాదం చోటుచేసుకోవడం తనను ఎంతో కలిచివేసిందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకోగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## తమిళనాడు, బెంగాల్ లో ఎన్నికల ప్రచారానికి తెర

- పోలింగ్ కు ఈసీ ఏర్పాట్లు
- ఏప్రిల్ 23న ఉదయం 7 గంటలకు ప్రారంభంకానున్న పోలింగ్
- మే 4న జరగనున్న ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాలు
- తమిళనాడులో ఓటు హక్కు వినియోగించుకోనున్న 5.67 కోట్ల మంది ప్రజలు

ప్రభాత గమనం, హైదరాబాద్ :

తమిళనాడు, బంగాల్లో తొలి విడత అసెంబ్లీ ఎన్నికల ప్రచార గడువు ముగిసింది. రాజకీయ నేతల ప్రసంగాలు, భారీ బహిరంగ సభలు, రోడ్ షోలతో మారుమోగిన మైకులు ఈ సాయంత్రం 6 గంటల తర్వాత మూగబోయాయి. చివరి రోజు అన్ని పార్టీలు ముమ్మర ప్రచారం నిర్వహించాయి. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు, బంగాల్‌లో తొలి విడతలో 152 సీట్లకు ఈ నెల 23న పోలింగ్ జరగనుంది. ఇందుకోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది.

**తమిళనాడులో ముగిసిన ఎన్నికల ప్రచారం**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగిసింది. ఆ రాష్ట్రంలో ఉన్న మొత్తం 234 శాసన సభ స్థానాలకు ఒకే విడతలో ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుంది. మొత్తం 4 వేల 23 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. సుమారు 5.73 కోట్ల మంది ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వయోవృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థం ఎన్నికల సంఘం ఇప్పటికే ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాన్ని కల్పించింది. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు, వేలాది పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. మే 4న ఓట్లు లెక్కించి ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం విడుదల చేయనుంది.

**డీఎంకే- ఎన్డీయే కూటమి అమీతుమీ**

రాష్ట్రంలో ప్రధానంగా రెండు బలమైన కూటముల మధ్య పోటీ నెలకొంది. ఈ ఎన్నికల బరిలో డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్, ఎన్డీయే కూటమి అమీతుమీ తెల్చుకోనున్నాయి. వీటితో పాటు నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' కూడా తన సత్తచాటడానికి సిద్ధమైంది. తమిళనాడులో అధికార DMK పార్టీ మొత్తంగా 164 స్థానాల్లో పోటీ చేస్తోంది. ఇందులో భాగంగా కొలత్తూరు నుంచి ముఖ్యమంత్రి M.K. స్టాలిన్ బరిలో ఉన్నారు. డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ (చెపాక్–తిరువల్లికేణి), సెంథిల్ బాలాజీ (కోయంబత్తూరు సౌత్) సహా ఇతర మంత్రులు పోటీ చేస్తున్నారు. ఎన్డీఏ కూటమి నుంచి అన్నాడీఎంకే అగ్రనేత ఎడప్పాడి కె. పళనిస్వామి (ఎడప్పాడి), బీజేపీ నేతలు ఎల్.మురుగన్, తమిళసై సౌందరరాజన్ బరిలో ఉన్నారు. విజయ్ నేతృత్వంలోని TVK మొత్తం 234 స్థానాల్లో పోటీ చేస్తుండగా, విజయ్ పెరంబూర్, తిరుచ్చి తూర్పు నుంచి పోటీ చేస్తున్నారు.

**బెంగాల్ తొలి విడత పోలింగ్‌కు సర్వం సిద్ధం**

బెంగాల్ శాసనసభ ఎన్నికల తొలి విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొత్తం 152 అసెంబ్లీ నియోజకవర్గాల్లో హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారం ఈ సాయంత్రం ముగిసింది. ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. మొత్తం 1,478 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 16 జిల్లాల్లో పోలింగ్ జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6.82 కోట్ల మంది ఓటర్లు ఉండగా మొదటి విడత ఎన్నికల్లో సుమారు 3.5 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 వేలకుపైగా పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. దాదాపు 10 వేల 361 పోలింగ్ కేంద్రాలను పూర్తిగా మహిళా సిబ్బందితోనే నిర్వహించనున్నారు. వృద్ధులు, వికలాంగుల కోసం వీల్ చైర్లు, ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు, నీడ వంటి వసతులను కల్పించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు వేలాది పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

**భవానీపూర్‌పైనే అందరి దృష్టి**

బంగాల్‌లో టీఎంసీ, బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ(ఎం) బరిలో ఉండగా, తీవ్ర పోటీ మాత్రం టీఎంసీ– బీజేపీ మధ్య నెలకొంది. ముఖ్యంగా భవానీపూర్ నియోజకవర్గంపైనే అందరి దృష్టి నెలకొంది. బంగాల్ సీఎం మమతా బెనర్జీ, ప్రతిపక్ష బీజేపీ నేత సువేందు అధికారి మధ్య హోరాహోరీ పోరు జరగడం ఖాయంగా కనిపిస్తోంది. 2021లో జరిగిన ఎన్నికల్లో బీజేపీకి 77 సీట్లు రాగా, మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) 213 సీట్లతో భారీ విజయాన్ని సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

**మమతా - సువేందు మధ్య హోరాహోరీ పోరు**

బంగాల్ మొదటి దశలోని కీలక అభ్యర్థుల్లో బీజేపీ, టీఎంసీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ప్రముఖులు ఉన్నారు. ముఖ్యంగా కూచ్ బెహార్, డార్జిలింగ్, సిలిగుడి, అసన్‌సోల్, బెర్హాంపూర్, కోల్‌కతా వంటి ప్రాంతాల్లోని అత్యంత కీలకమైన స్థానాలలో వీరు బరిలో ఉన్నారు. ముఖ్యంగా బంగాల్ సీఎం మమతా బెనర్జీ, ప్రతిపక్ష బీజేపీ నేత సువేందు అధికారి మధ్య హోరాహోరీ పోరు జరగడం ఖాయంగా కనిపిస్తోంది. తొలి విడతలో బీజేపీ నుంచి దిలీప్ ఘోష్, స్వపన్ దాస్‌గుప్తా అటు టీఎంసీ నుంచి జగదీష్ చంద్ర బసునియా, సూర్యకాంత దోలుయ్, సత్యజిత్ బర్మన్ పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ మొత్తం 284 మంది అభ్యర్థులను ప్రకటించగా తొలి విడతలో అధీర్ రంజన్ చౌదరి, మౌసమ్ నూర్, మాధవ్ రాయ్ వంటి అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

## ఏసీబీ వలలో నారాయణపేట ఆర్డీవో..

- లంచం తీసుకుంటూ పట్టుబడిన రాంచందర్ నాయక్
- నివాసం, కార్యాలయంలో కొనసాగుతున్న సోదాలు

ప్రభాత గమనం, నారాయణపేట, ఏప్రిల్ 21:



అవినీతి తిమింగలాలపై ఏసీబీ అధికారులు మరోసారి పంజా విసిరారు. లంచం కోసం ఆశపడి నారాయణపేట ఆర్డీవో రామచందర్ నాయక్ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. రూ. 25 వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు ఆయన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆర్డీవో పట్టుబడటంతో ఏసీబీ అధికారులు దాడులను ముమ్మరం చేశారు. నారాయణపేటలోని బాబా కాలనీలో ఉన్న రామచందర్ నాయక్ నివాసంతో పాటు, ఆయన కార్యాలయంలోనూ ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో కీలక పత్రాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

**బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి:**

ఓ పని నిమిత్తం తన దగ్గరకు వచ్చిన వ్యక్తిని ఆర్డీవో లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. పక్కా ప్రణాళికతో నిఘా పెట్టిన అధికారులు, డబ్బులు మారుతున్న సమయంలోనే దాడి చేసి ఆర్డీవోను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం కేసు నమోదు చేసిన అధికారులు, మరిన్ని వివరాల కోసం విచారణ జరుపుతున్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య
- గార్లలో కళ్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- 45 మంది లబ్ధిదారులకు రూ.45 లక్షల చెక్కులు అందజేత
- రూ. 12.78 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ




**గార్ల, ఏప్రిల్ 21, ప్రభాత గమనం:**

తెలంగాణ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఆడబిడ్డల పెళ్లిళ్లకు 'కళ్యాణ లక్ష్మి ', 'షాదీ ముబారక్' పథకాలు కొండంత అండగా నిలుస్తున్నాయని ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కోరం కనకయ్య అన్నారు. మంగళవారం గార్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ పేదవాడు వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు.మండలంలోని 45 మంది లబ్ధిదారులకు రూ. 45 లక్షలకు పైగా విలువైన చెక్కులను అందజేశారు.అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన బాధితులకు రూ. 12,78,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.ఇదే క్రమంలో, గార్ల గ్రామ పంచాయతీ పరిధిలోని మసీదు అభివృద్ధి కోసం స్థానిక మైనారిటీ సోదరులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, మసీదు అభివృద్ధికి తగిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ బానోత్ రాంబాబు, గార్ల మాజీ సొసైటీ చైర్మన్ శ్రీ వడ్లమూడి దుర్గాప్రసాద్, గార్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతి పాల్గొన్నారు. వారితో పాటు వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు గంగావతి రామ్ సింగ్ (పెద్ద కిష్టాపురం), బానోత్ మోతిలాల్ (చిన్న బంజర), భూక్యా నాగేశ్వర రావు (మర్రిగూడెం), వెంకట్ రామ్ (ములకనూర్), బాదావత్ రమ్య (పోచారం), సుశీల (రాజు తండా), దేవి (బిఆర్ న్ తండా), ఉమా (కోటియా నాయక్ తండా) మరియు మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నిరుపేదల సొంతింటి కల సాకారం

- ఘనంగా 'ఇందిరమ్మ' ఇంటి గృహప్రవేశం
- హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి

**కేసముద్రం, ఏప్రిల్ 21, ప్రభాత గమనం:**

పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కల్వల గ్రామంలో లబ్ధిదారులు గుండెబోయిన ఎల్లమ్మ నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేయించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. సమాజంలో ఇళ్లు లేని నిరుపేదలకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా కేవలం అర్హతనే ప్రామాణికంగా తీసుకుని ఇళ్లను మంజూరు చేస్తున్నామని ఆయన తెలిపారు.ఇప్పటికే మొదటి విడత ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయని, త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుందని పేదలకు భరోసా ఇచ్చారు. గ్రామస్తులు పాల్గొని లబ్ధిదారురాలు ఎల్లమ్మకు శుభాకాంక్షలు తెలియజేశారు. తన సొంతింటి కల నెరవేరినందుకు ఎల్లమ్మ ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



# సేంద్రియ సాగుతోనే రైతులకు మేలు

- తాళ్లపూసపల్లిలో జిల్లా వ్యవసాయాధికారి పర్యటన..

**కేసముద్రం, ఏప్రిల్ 21, ప్రభాత గమనం :**

మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి భూక్యా సరిత విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలను, రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని,మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు.గ్రామంలోని సేంద్రియ వ్యవసాయ పంట క్షేత్రాలను పరిశీలించిన సరిత, రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి సిద్ధమైన సాగు వైపు రైతులు మొగ్గు చూపడాన్ని అభినందించారు. నాణ్యమైన దిగుబడితో పాటు భూసారాన్ని కాపాడుకోవడంలో సేంద్రియ పద్ధతులు ఎంతో కీలకమని ఆమె పేర్కొన్నారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, ధాన్యం సేకరణ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. తేమ శాతం నిబంధనల ప్రకారం పాటిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఉత్పత్తిదారుల సంఘం పనితీరును సమీక్షించిన ఏడీఏ అజ్మీరా శ్రీనివాస్ రావు, రైతులు ఉమ్మడిగా జట్టుకట్టి మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు."రైతులు కేవలం సాగుకే పరిమితం కాకుండా, మార్కెట్ ధరలపై అవగాహన పెంచుకోవాలని,ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుంటూ లాభసాటి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు సహాయ వ్యవసాయ సంచాలకులు అజ్మీరా శ్రీనివాస్ రావు, కేసముద్రం మండల వ్యవసాయాధికారి బి. వెంకన్న, అభ్యుదయ రైతు సోల్లేటి జయపాల్ రెడ్డి, ఏఈఓ కల్వల వి. లావణ్య స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లంచం డిమాండ్‌పై ఫిర్యాదు..

- పట్టుబడ్డ వికారాబాద్ సీఐ సరోజ, ఎస్ఐ రాణి

**హైదరాబాద్, ప్రభాత గమనం :**

వ్యక్తిగత కుటుంబ వివాదానికి సంబంధించిన కేసులో లంచం డిమాండ్ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. కౌన్సిలర్ ఇర్షాద్ తెలిపిన వివరాల ప్రకారం, తన కుటుంబ సమస్యను తప్పుదారి పట్టించి సెక్షన్ 498ఏ కింద కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వికారాబాద్ ఉమెన్స్ పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ బెయిల్ పేరుతో ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.60వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపించారు. అవినీతి డిమాండ్‌ను సహించలేక సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడంతో, లంచం స్వీకరిస్తున్న సమయంలో పోలీస్ అధికారులు పట్టుబడినట్లు తెలిపారు. అవినీతి ఎక్కడ జరిగినా ప్రజలు భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు.

## గౌడ సంఘం 'భీష్మ పితామహుడు'

# పుల్లూరి దూడయ్య గౌడ్ కన్నుమూత

- గౌడ కుల బాంధవులకు దిశానిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి
- క్రమశిక్షణ కలిగిన ఉద్యోగిగా, సామాజిక నేతగా చెరగని ముద్ర
- భౌతికకాయానికి నివాళులర్పించిన సమ్మయ్య గౌడ్, వెంకట్రాం నర్సయ్య గౌడ్



**కేసముద్రం, ఏప్రిల్ 21, ప్రభాత గమనం :**

కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో ఒక శకం ముగిసింది. గౌడ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు, క్రమశిక్షణ కలిగిన విశ్రాంత ఉద్యోగి పుల్లూరి దూడయ్య గౌడ్ మరణంతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. సామాజిక స్పృహ కలిగిన నాయకుడిగా, సంఘం బలోపేతానికి ఆయన చేసిన నిరంతర కృషిని స్మరించుకుంటూ పలువురు ప్రముఖులు అశ్రు నివాళులర్పించారు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు.దూడయ్య గౌడ్ భౌతికకాయానికి గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మయ్య గౌడ్, ప్రముఖ నేత చీకటి వెంకట్రాం నర్సయ్య గౌడ్ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా టీచర్ వెంకట్రాం నర్సయ్య, సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ.. దూడయ్య గౌడ్ మరణం గౌడ సమాజానికి తీరని లోటు అని పేర్కొన్నారు. "దూడయ్య గౌడ్ కేవలం ఒక ప్రభుత్వ ఉద్యోగి మాత్రమే కాదు, గౌడ కుల బాంధవులందరికీ ఒక దిక్సూచి అని, సంఘం ఆవిర్భావం నుండి నేటి వరకు ఆయన చూపిన చొరవ, చేసిన త్యాగాలు అమోఘమని తెలిపారు. పదవీ విరమణ పొందినా, విశ్రమించకుండా సమాజ శ్రేయస్సు కోసమే పరితపించిన నిబద్ధత కలిగిన వ్యక్తి ఆయన" అని వారు కొనియాడారు.దూడయ్య గౌడ్ సేవలను స్మరించుకున్న వారిలో మోడెం రవీందర్ గౌడ్, నాగేశ్వరా చారి, సవీన్, చింతనూరి సతీష్, గొర్రె వెంకన్న, సాయిరాం అశోక్ గౌడ్, పబ్బతి సారంగపాణి, కట్టయ్య, పలుస రాకేష్ తదితరులు ఉన్నారు. సామాజిక కార్యకర్తగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని వారంతా పేర్కొన్నారు.

# మురుగు కూపంలో పుల్లూరు ఎస్సీ కాలనీ

- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- చర్యలు చేపట్టాలని కాలనీవాసుల వేడుకోలు



**గార్ల, ఏప్రిల్ 21, ప్రభాత గమనం:**

పాలకులు మారుతున్నారు.. ఏళ్లు గడుస్తున్నాయి.. కానీ ఆ కాలనీ వాసుల తలరాత మాత్రం మారడం లేదు. 'స్వచ్ఛ భారత్' నినాదాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి తప్ప, క్షేత్రస్థాయిలో మురుగు నీటి కష్టాలు తీరడం లేదు. గార్ల మండలం పుల్లూరు గ్రామ పరిధిలోని ఎస్సీ కాలనీ ప్రస్తుతం దుర్వాసనతో, మురుగు నీటితో నరకాన్ని తలపిస్తోంది.కాలనీలో సరైన సైడ్ కాల్వలు (డ్రైనేజీ) లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. గ్రామ పంచాయతీ అధికారులకు మొరపెట్టుకుంటే, వారు వచ్చి మొక్కుబడిగా పైపైన పూడిక తీసి వెళ్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం వల్ల మురుగు నీరు నిలిచిపోయి తీవ్రమైన దుర్వాసన వస్తోంది.మురుగు నీరు నిల్వ ఉండటంతో కాలనీలో దోమల ఉధృతి విపరీతంగా పెరిగింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమలు కరుస్తుండటంతో చిన్నారులు, వృద్ధులు అనారోగ్యం పాలవుతారని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కాలనీ గుండా నడవాలంటేనే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఈ నరకం నుంచి తమకు విముక్తి ఎప్పుడని వారు ప్రశ్నిస్తున్నారు."గత ప్రభుత్వం ఎన్నికల సమయంలో డ్రైనేజీ పనులు చేయిస్తామని హామీ ఇచ్చి చేతులు తుడిపేసుకుంది. ఇప్పుడున్న వారిని అడిగితే పాత బిల్లులు రాలేదని, నిధుల కొరత ఉందని సాకులు చెబుతున్నారు. మా ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారా?" అని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓట్ల కోసం వచ్చే నాయకులు, సమస్యల పరిష్కారంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, పుల్లూరు ఎస్సీ కాలనీలో శాశ్వత ప్రాతిపదికన డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలని, పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.




# మక్కల కొనుగోళ్లు చేపట్టాలి

- ఎకరాకు 26 క్వింటాళ్ల నిబంధనను ఎత్తివేయాలి
- మండల కేంద్రాల్లో అదనపు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి
- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్

**గార్ల ఏప్రిల్ 21, ప్రభాత గమనం :**

రైతాంగం పండించిన మొక్కజొన్న, జొన్న పంటను ఎటువంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెభోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పంట కొనుగోలులో ప్రభుత్వం విధిస్తున్న నిబంధనల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రభుత్వం ఎకరాకు కేవలం 26 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామనే నిబంధన పెట్టడం సరికాదన్నారు. ఆశించిన దానికంటే ఎక్కువ దిగుబడి వచ్చినప్పుడు, మిగిలిన పంటను రైతులు ఎక్కడ అమ్ముకోవాలని ఆయన ప్రశ్నించారు. ఈ నిబంధనను తక్షణమే ఎత్తివేసి, రైతుల వద్ద ఉన్న ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరకు సేకరించాలని కోరారు.మండల కేంద్రంలో కేవలం ఒకే ఒక్క కొనుగోలు కేంద్రం ఉండటం వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శ్రీనివాస్ పేర్కొన్నారు. వందలాది మంది రైతులు ఒకే చోటికి రావడం వల్ల రవాణా భారంతో పాటు, రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని విమర్శించారు. రైతుల సౌకర్యార్థం గ్రామాలకు దగ్గరలో మరిన్ని అదనపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. "చెమటోడ్చి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు రోడ్లపై పడిగాపులు కాయడం దురదృష్టకరం. ప్రభుత్వం స్పందించి నిబంధనలు సడలించకపోతే రైతుల పక్షాన పోరాటాలు ఉధృతం చేస్తాం."ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, నాయకులు ఉపేందర్, పుల్లారావు, వీరన్న, వెంకన్న, ఐలయ్య మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.




## పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు

# ప్రీ-ప్రైమరీ విద్యే పునాది..

- మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత

**కేసముద్రం, ఏప్రిల్ 21, ప్రభాత గమనం:**

పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు పునాది ప్రీ-ప్రైమరీ విద్యే అని నేటి సమాజంలో విద్యార్థి దశ అత్యంత కీలకమని కేసముద్రం మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత అన్నారు. మంగళవారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని విలేజ్ కేసముద్రం గ్రామంలో గల ప్రీ-ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవం, గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అత్యంత వైభవంగా జరిపారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీతతో పాటు, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ లు మాట్లాడుతూ.. పలు కీలక వ్యాఖ్యలు చేశారు.అక్షరాభ్యాసం వైపు అడుగులు వేసే పిల్లలకు ప్రీ-ప్రైమరీ విద్య అనేది జీవితంలో మొదటి మెట్టు వంటిదని పేర్కొన్నారు.చిన్నారి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ మంత్రముగ్ధులను చేశాయని, వారిలోని సృజనాత్మకతను వెలికితీయడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని కొనియాడారు.గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న చిన్నారులకు అతిథుల చేతుల మీదుగా పట్టాలను అందజేసి, వారిని ఆశీర్వదించారు.పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు, ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల ముద్దుముద్దు మాటలు, వారి ప్రతిభను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు.ఈ వేడుకలో తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో క్రాంతి కుమారి,సిడిపివో శిరీష తో పాటు కౌన్సిలర్లు వేముల భారతి, కనుకుల సుభద్ర, వల్లందస్ ఉమా, మేకల శారద, రావుల వినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సామాజిక అంశాల్లో అవగాహన ఉండాలి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్.

**మహబూబాబాద్ ప్రతినిధి, ప్రభాత గమనం:**




విద్యతోపాటు సామాజిక అంశాలపై విద్యార్థిని, విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ స్నేహ శబరిష్ సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుండి 26 వరకు సంక్షేమ వారోత్సవాలు ప్రారంభం అయిన నేపథ్యంలో రెండవ రోజు మహాత్మ జ్యోతిరావు పూలే, పత్తిపాక లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వసతి గృహంలోని స్టోర్ గది కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, తరగతి గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ రోజు కిచెన్ క్లీనింగ్, సానిటేషన్, హెల్త్ ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, పరిసరాల పరిశుభ్రత, హెల్మెట్ సీట్ బెల్ట్ రోడ్డు భద్రత, డ్రగ్స్ నివారణ తదితర అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించారు. సంక్షేమ పాఠశాలలో విద్యార్థుల యొక్క ప్రతిభను సృజనాత్మకతలను వెలికితీయడం మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేందుకు తీసుకోవలసిన చర్యలు వివిధ సబ్జెక్టులలో జ్ఞానాన్ని మరియు శీఘ్ర ఆలోచనా విధానాన్ని పరీక్షించడం కోసం క్విజ్ పోటీలు, బాలల హక్కుల, కార్యక్రమాలు, బాలల హక్కులు, విద్య మరియు ఆరోగ్య అవగాహనపై వీధి నాటకాలు, సామాజిక న్యాయం, విద్య మరియు పర్యావరణం – ఆంగ్లంలో మరియు తెలుగులో చర్చ ప్రసంగాలు సామాజిక న్యాయ, ప్రకృతి మరియు సంస్కృతి అంశాలపై సృజనాత్మక వ్యక్తీకరణ పై డ్రాయింగ్, పెయింటింగ్ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించారు. కేవలం విద్య ద్వారానే క్రమశిక్షణ ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పట్టుదల ఏకాగ్రత తో విద్యను అభ్యసించాలని, అలాగే శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు, అందుకోసం క్రమం తప్పకుండా వ్యాయామం సమయానుకూలంగా పుస్తకాలు చదవాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పిల్లలను సన్మానించి ప్రశంసా పత్రాలను అందించారు. రోడ్డు భద్రత, డ్రగ్స్ నివారణ సామాజిక అంశాలపై నిర్వహించిన వ్యాసరచన క్విజ్ పోటీలలో గెలుపొందిన వారిని అభినందించారు. ప్రభుత్వం అన్ని విద్యాసంస్థలలో కామన్ డైట్ మెనూ ప్రవేశపెట్టి పిల్లలందరికీ రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించడం ద్వారా మంచి ఆరోగ్యంగా ఉంటూ ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు విద్యను అభ్యసించడం కోసం సంబంధిత విద్య సిబ్బంది ఏర్పాట్లు చేయాలని అన్నారు. పిల్లలకు, భోజనం సిద్ధం చేసే సిబ్బంది కి షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించి, అట్టి నివేదికలను సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి జెడ్పీ సీఈఓ పురుషోత్తం, కళాశాల ప్రిన్సిపల్ రాజేష్ పాల్గొన్నారు.

# వరంగల్‌లో రైల్వే స్టేషన్ లో భారీగా 'హ్యాష్ ఆయిల్' పట్టివేత

- రూ. 2.5 కోట్ల విలువైన 40 కిలోల గంజాయి నూనె స్వాధీనం
- ముంబైకి తరలిస్తుండగా పట్టుకున్న రైల్వే పోలీసులు
- నలుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీపీ సన ప్రీత్ సింగ్



ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో

వరంగల్ రైల్వే పోలీసుల నిఘాకు భారీ అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా చిక్కింది. ఓడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ముంబైకి అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ. 2.5 కోట్ల విలువైన హ్యాష్ ఆయిల్ (గంజాయి నూనె)ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేయగా, మరో నిందితుడు కిలో పాండు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఈ మేరకు మంగళవారం మీడియాకు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలు వెల్లడించారు.

**రైల్వే స్టేషన్‌లో మెరుపు దాడి:**

నమ్మదగిన సమాచారం మేరకు వరంగల్ రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ముంబై వెళ్లే రైలు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న నలుగురు వ్యక్తుల కదలికలు అనుమానాస్పదంగా ఉండటంతో వారిని అదుపులోకి తీసుకుని సోదాలు చేశారు. వారి వద్ద ఉన్న బ్యాగుల్లో 40 కిలోల హ్యాష్ ఆయిల్ లభ్యమైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు రెండున్నర కోట్ల రూపాయల వరకు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. పట్టుబడిన వారిలో ముగ్గురు ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లాకు చెందిన హంటల్ సన్ను, హంటల్ సన్యాసి, కష్ణ హంటల్ కాగా, మరొకరిని ఏపీలోని అల్లూరి సీతారామ రాజు జిల్లాకు చెందిన చిన్నబాబుగా గుర్తించారు. వీరంతా ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి మొక్కల నుండి ఈ హ్యాష్ ఆయిల్‌ను సేకరించి, అత్యధిక ధరలకు విక్రయించేందుకు ముంబై వంటి మహానగరాలకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితులపై ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ముఠా వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులు ఎవరు? గతంలో వీరు ఎన్నిసార్లు ఇలాంటి స్మగ్లింగ్‌కు పాల్పడ్డారు? అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. వరంగల్ మీదుగా జరుగుతున్న ఈ మాదకద్రవ్యాల రవాణా స్థానిక పోలీసు వర్గాల్లో కలకలం రేపుతోంది. కాగా, పెద్ద ఎత్తున హాష్ అయిల్‌తో పాటు నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, వరంగల్ ఏఎస్పీ శుభం, ఏసీపీలు జితేందర్ రెడ్డి, జానీ నర్సింహులు, డ్రగ్ కంట్రోల్ టీం ఇన్ స్పెక్టర్ వై.సతీష్, ఇంతేజార్‌గంజ్ ఇన్ స్పెక్టర్ షూకూర్, ఎస్ఐలు సందీప్, తేజ ఆర్ఎస్ఐలు ఏ.పూర్ణ చందర్ రెడ్డి, కె.మనోజ్ రెడ్డి, ఎల్.లింగా రావు, క్యాట్ పార్టీ ఏఆర్ ఏఎస్ఐలు వి.సుబ్బిరామి రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్ళు బాల రాజు, కె.శ్రీరాములు, ఎండీ రబ్బానీ, ఆర్.రాజ్‌కుమార్‌తో పాటు ఇంతేజార్‌గంజ్ సిబ్బందిని సీపీ అభినందించారు.



# బహుజన రాజ్యం తీన్మార్ మల్లన్నతోనే సాధ్యం

- ఈనెల 26 ఇందిరా పార్క్ మహా ధర్నాకు భారీగా తరలి రావాలి
- ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటాం
- టీఆర్పీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీ కుమార్ యాదవ్

హన్మకొండ, ఏప్రిల్ 21, ప్రభాత గమనం :

తెలంగాణ రాజ్యాధికార పార్టీ హన్మకొండ జిల్లా ముఖ్య నాయకుల స్థాయి సమావేశం ఈరోజు జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బత్తిని వెంకటేష్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజిని కుమార్ యాదవ్ హాజరై మాట్లాడుతూ.. టీఆర్పీలో చేరిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు ఈనెల 26న హైదరాబాదులోని ఇందిరా పార్క్ లో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల ఫీజు దోపిడీకి వ్యతిరేకంగా చేస్తున్న నిరసన కార్యక్రమానికి జిల్లా నుండి విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ప్రతి నాయకుడు ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పోరాడాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో తీన్మార్ మల్లన్న నాయకత్వంలో బహుజన రాజ్యం ఏర్పడుతుందన్న విశ్వాసం వ్యక్తం చేసిన ఆయన అందుకోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సాంప్రదాయ రాజకీయ పార్టీల బురదను అంటించుకోకుండా క్రమశిక్షణతో ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. అతి త్వరలోనే హన్మకొండ జిల్లా వ్యాప్తంగా మండల కమిటీల నియామకం పూర్తి చేయాలని జిల్లా కమిటీని ఆదేశించారు. కొద్ది రోజుల్లోనే తెలంగాణలో జెడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందని పార్టీ నాయకత్వం మొత్తం ఈ ఎన్నికలను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. గ్రేటర్ వరంగల్ లో సగానికి పైగా డివిజన్లో పార్టీని సంస్థాగతంగా నిర్మించామని గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున శర్మ తెలిపారు. బీసీ ప్రభుత్వ ఉద్యోగుల లెక్కింపు ప్రక్రియ పూర్తి కావచ్చిందని వర్కింగ్ ప్రెసిడెంట్ పూజారి సత్యనారాయణ తెలిపారు. జిల్లాలో మహిళలు పార్టీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని మహిళా అధ్యక్షురాలు బాలినే లక్ష్మి అన్నారు. మే నెల రెండో వారం పూర్తయ్య నాటికి హన్మకొండ జిల్లా పూర్తిస్థాయి కార్యవర్గం ఎంపిక తో పాటు మండల కమిటీల ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట రాజు తెలిపారు. జూన్ 2 నుండి రాష్ట్రవ్యాప్తంగా పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న పాదయాత్ర మొదలవుతుందని ఆ యాత్ర విజయవంతం చేసేందుకు హన్మకొండ జిల్లా నాయకత్వం మొత్తం కలిసికట్టుగా పనిచేయాలని సమావేశంలో పాల్గొన్న మిగతా నాయకులందరూ సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు పెండాల సంపత్, రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి పోలు రాజు, సోషల్ మీడియా కన్వీనర్ మార్త శ్రీనివాస్,భద్రకాళి రమణ, మెరుగు భరద్వాజ్, బాల్నే మోహన్, రంజిత్, ఐలయ్య,కిషోర్, రాజు, నరేందర్, ముడారి రమేష్, విజయ్, అరుణ్,రాధిక, సుమతి, కోరుకొప్పుల సమ్మయ్య, చంద్రమౌళి గౌడ్



# విద్యార్థులతో కలిసి భోజనం..

- పాఠశాలు, హాస్టళ్లలో సమస్యలపై ఆరా...
- సంక్షేమ వారోత్సవాల్లో అదనపు కలెక్టర్, ప్రత్యేక అధికారుల తనిఖీలు...

మహబూబాబాద్ ప్రతినిధి, ప్రభాత గమనం:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సంక్షేమ వారోత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పోతో పాటు జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులు వివిధ వసతి గృహాలు, పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించి, ఈ వారోత్సవాలను అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నారు అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో. కొత్తగూడెం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలను సందర్శించి వసతులను పరిశీలించారు. జిల్లా పరిషత్ సీఈవో: పత్తిపాకలోని మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలలో పర్యవేక్షించారు. ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస రావు: మహబూబాబాద్‌లోని తెలంగాణ మైనారిటీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. గిరిజన సంక్షేమ అధికారి దేశీరామ్ నాయక్ నెల్లికుదురు మండలంలోని ఆశ్రమ పాఠశాల, మహాత్మ జ్యోతిరావు పూలే వసతి గృహాలను సందర్శించారు. మరియాన్న నెల్లికుదురు ఎస్సీ హాస్టల్‌ను, వ్యవసాయ శాఖ ఏడీ మురళి కొరవిలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా కలెక్టర్ కీలక సూచనలు చేశారు. కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా, అధికారులు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం లేదా రాత్రి భోజన సమయంలో విద్యార్థులతో కలిసి కూర్చోవాలని ఆదేశించారు. తద్వారా భోజనం నాణ్యతను స్వయంగా పరీక్షించడంతో పాటు, విద్యార్థులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు ఫొటోలు, పూర్తి వివరాలతో కూడిన నివేదికలను జిల్లా యంత్రాంగానికి పంపాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని వసతి గృహాల రూపురేఖలు మార్చేందుకు కృషి చేస్తున్నారు.

# రేవంత్ రాహువు.. కేసీఆర్ కేతువు

## ఇద్దరూ కలిసి ప్రజలను ముంచుతున్నారు..

- కాళేశ్వరం అవినీతిని కప్పిపుచ్చేందుకే సీఎం డ్రామాలు..
- కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు!
- బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని స్పష్టీకరణ



ప్రభాత గమనం, హైదరాబాద్, ఏప్రిల్ 21:

రాష్ట్ర రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ల తీరుపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డిని 'రాహువు'గా, కేసీఆర్‌ను 'కేతువు'గా అభివర్ణించిన ఆయన.. వీరిద్దరూ పైకి తిట్టుకుంటూ లోపల మాత్రం తెలంగాణ ప్రజలను వంచిస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం కరీంనగర్ రేకుర్తి చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

**కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతున్న రేవంత్:**


కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల రూపాయల అవినీతి జరిగిందని గత ఎన్నికల్లో గొంతు చించుకున్న రేవంత్ రెడ్డి, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక కేవలం రూ. 9 వేల కోట్ల స్కామ్ మీదనే సీబీఐ విచారణ కోరడం వెనుక ఆంతర్యం ఏమిటని బండి సంజయ్ ప్రశ్నించారు. "కేసీఆర్ కుటుంబాన్ని కాపాడటానికే రేవంత్ రెడ్డి తెలివిగా వ్యవహరిస్తున్నారు. లక్ష కోట్ల ధనం వృథాపై విచారణ ఎందుకు కోరడం లేదు? కేసీఆర్, రేవంత్ ఆడుతున్న ఈ అవినీతి డ్రామాలపై త్వరలోనే ప్రజలకు బహిరంగ లేఖ రాస్తాం" అని ఆయన హెచ్చరించారు.

**బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదు:**

బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు పెట్టుకోబోతున్నాయంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని బండి సంజయ్ కొట్టిపారేశారు. "బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదు. గతంలో వారితో జతకట్టింది కాంగ్రెస్ పార్టీనే, భవిష్యత్తులోనూ అదే జరుగుతుంది. రేవంత్ రెడ్డి తన సీటు ఎక్కడ ఖాళీ అవుతుందోనన్న భయంతో ఏకంగా రాహుల్ గాంధీ సీటుకే ఎసరు పెట్టారు" అని ఎద్దేవా చేశారు.

**తేజస్వీ సూర్య వ్యాఖ్యల వక్రీకరణ:**

కర్ణాటక ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలను కాంగ్రెస్, బీఆర్ఎస్ కావాలనే వక్రీకరిస్తున్నాయని బండి సంజయ్ మండిపడ్డారు. కాంగ్రెస్ పాపాల వల్ల దేశ విభజన సమయంలో ఎలాగైతే ప్రాణనష్టం జరిగిందో, వారి తప్పుడు విధానాల వల్ల తెలంగాణలోనూ 1400 మంది బలిదానాలు జరిగాయని మాత్రమే ఆయన అన్నారని సమర్థించారు. పార్లమెంటులో సుష్మా స్వరాజ్ నేతృత్వంలో బీజేపీ ఎంపీలే తెలంగాణ బిల్లును గట్టెక్కించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లు గుగ్గిళ్ల రమేశ్, బోయినిపల్లి ప్రవీణ్ రావు తదితరులు పాల్గొన్నారు.



# ఉప్పల్లో అభిషేక్ 'సునామీ'

- భారీ సెంచరీతో షేక్ ఆడించిన అభిషేక్ వర్మ
- నాలుగు వికెట్లతో ఢిల్లీని మడతబెట్టిన మలింగ
- ఆరెంజ్ ఆర్మీ ఘన విజయం

ప్రభాత గమనం, స్పోర్ట్స్ డెస్క్ :

సన్ రైజర్స్ హైదరాబాద్ హ్యాట్రిక్ కొట్టింది. సొంతగడ్డ ఉప్పల్ లో మరోసారి జయకేతనం ఎగురవేసింది. డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ భారీ సెంచరీ, పేసర్ ఏషన్ మలింగ నాలుగు వికెట్లతో రాణించిన వేళ ఆరెంజ్ ఆర్మీ 47 పరుగుల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టింది. సన్ రైజర్స్ నిర్దేశించిన 243 పరుగుల భారీ ఛేదనలో ఢిల్లీ ఓవర్లన్నీ ఆడి వికెట్లు కోల్పోయి 195 పరుగులే చేయగలిగింది. నితీశ్ రాణా (57), సమీర్ రిజ్వీ (41) పోరాటం సరిపోలేదు. సన్ రైజర్స్ బౌలర్లలో ఏషన్ మలింగ 4, హర్ష్ దూబె 3, మధుషంక, సాకిబ్ హుస్సేన్ చెరో వికెట్ పడగొట్టారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన సన్రైజర్స్ 20 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 242 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (135 పరుగులు, నాటౌట్) సెంచరీతో అదరగొట్టాడు. ట్రావిస్ హెడ్ (37 పరుగులు), హెన్రిచ్ క్లాసెన్ (37 పరుగులు) రాణించారు. కెప్టెన్ ఇషాన్ కిషన్ (25) ఫర్వాలేదనిపించారు. ఢిల్లీ బౌలర్లలో అక్షర్ పటేల్ 1 వికెట్ పడగొట్టాడు. తాజా విజయంతో సన్ రైజర్స్ టేబుల్లో మూడో స్థానానికి దూసుకెళ్లింది. ఇప్పటిదాకా 7 మ్యాచ్ లు ఆడిన ఆరెంజ్ ఆర్మీ నాలు గింట్లో విజయం సాధించి 8 పాయింట్లతో కొనసాగుతోంది. మరోవైపు ఆరింట్లో మూడు విజయాలు, మూడు ఓటములతో ఢిల్లీ ఐదో స్థానంలో కొనసాగుతోంది.

# 'భూభారతి'తో రైతులకు శాశ్వత భరోసా!

- కూసుమంచిలో సర్వే మ్యాప్ తో తొలి రిజిస్ట్రేషన్..
- ప్రతి ఇంచుకు ప్రత్యేక 'భూధార్' నంబర్..
- రెవెన్యూ సంస్కరణలపై మంత్రి పొంగులేటి కీలక ప్రకటన



ప్రభాత గమనం, హైదరాబాద్, ఏప్రిల్ 21 :

రాష్ట్రంలో దశాబ్దాలుగా వేధిస్తున్న భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వం సరికొత్త విప్లవానికి నాంది పలికిందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. మంగళవారం ఖమ్మం జిల్లా కూసుమంచిలో 'భూభారతి' పోర్టల్ ద్వారా సర్వే మ్యాప్‌తో కూడిన తొలి భూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనలో ఇదొక మైలురాయి అని ఆయన ఈ సందర్భంగా అభివర్ణించారు. రెవెన్యూ రికార్డులను అత్యంత పారదర్శకంగా మార్చేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని, రెవెన్యూ వ్యవస్థలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేపట్టిన సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

**'భూధార్'తో ప్రత్యేక గుర్తింపు:**

మనుషులకు ఆధార్ కార్డు ఉన్నట్లే, ప్రతి భూమికి ఒక ప్రత్యేకమైన 'భూధార్' (భూ- ఆధార్) నంబర్‌ను కేటాయించనున్నారు. దీనివల్ల డూప్లికేట్ రికార్డులకు ఆస్కారం ఉండదు. ఇకపై కేవలం కాగితాల మీద రిజిస్ట్రేషన్ కాకుండా, ప్రతి భూమికి సంబంధించిన స్పష్టమైన సర్వే మ్యాప్ రిజిస్ట్రేషన్ పత్రంలోనే పొందుపరచడం తప్పనిసరి. దీనివల్ల సరిహద్దు వివాదాలు, ఆక్రమణలకు చెక్ పడుతుంది. ల్యాండ్ రికార్డ్స్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలు.. ఈ మూడు గతంలో విడివిడిగా ఉండేవి. ఇప్పుడు 'భూభారతి' ద్వారా వీటన్నింటినీ ఒకే ప్లాట్‌ఫామ్‌పైకి తెచ్చినట్లు మంత్రి వివరించారు.

**పైలట్ ప్రాజెక్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు:**

ప్రస్తుతం రాష్ట్రంలోని ఐదు ఎంపిక చేసిన మండలాల్లో ఈ విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు. కూసుమంచిలో చారిత్రాత్మకంగా తొలి నమోదు జరగడం సంతోషంగా ఉందన్న పొంగులేటి.. ఇది రైతు కుటుంబాలకు నమ్మకాన్ని ఇస్తుందని చెప్పారు. భూ వివాదాలు లేని తెలంగాణను నిర్మించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు. రైతు భూమి హక్కులపై మా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సర్వే పరికరాలతో రాష్ట్రంలోని ప్రతి ఇంచు భూమిని కొలిచి, భూ రికార్డులను దశలవారీగా ప్రక్షాళన చేస్తాం" అని పొంగులేటి స్పష్టం చేశారు. భూభారతి పోర్టల్ అనేది కేవలం ఒక వెబ్‌సైట్ కాదని, అది రైతులకు రక్షణ కవచమని మంత్రి పేర్కొన్నారు. భూమి క్రయవిక్రయాల్లో మోసాలకు గురికాకుండా, కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఈ వ్యవస్థ భరోసా ఇస్తుందని చెప్పారు. రెవెన్యూ శాఖలో అవినీతికి తావులేకుండా, సామాన్యుడికి త్వరితగతిన సేవలు అందించడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374